సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

బుధవారం ॥ 29 ॥ మే ॥ 2024



నేటి నుంచి గండిలో హనుమజ్జయంతి వేడుకలు

గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో బుధవారం నుంచి హనుమజ్జయంతి వేడుకలు నాలుగు రోజుల పాటు జరగనున్నాయి. -8లో



కడప, కర్నూలు జట్ల విజయం

కడపలోని కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రీడామైదానాల్లో జరిగిన ఏసీఏ సౌత్‌జోన్ అంతర్ జిల్లాల క్రికెట్ మ్యాచ్‌ల్లో కడప, కర్నూలు జట్లు విజయం సాధించాయి. -8లో

గరిష్టం/కనిష్టం
38.2/29.2

వాతావరణం

జిల్లాలో మంగళవారం 29.2 – 38.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 9.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

పది సప్లిమెంటరీ పరీక్షకు 1073 మంది హాజరు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన మ్యాథ్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని 16 పరీక్ష కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 1753 మందికి 1073 మంది విద్యార్థులు హాజరుకాగా 680 మంది గైర్హాజరయారు. రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు జిల్లాలోని 8 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశాయి. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగాయని జిల్లా విద్యాశాఖ అధికారి మర్రెడ్డి అనురాధ తెలిపారు.

ఆడిట్‌ను వాయిదా వేయాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఈనెల 29వ తేదీ జరిగే స్కూల్ కాంపోజిట్ గ్రాంట్స్ అడిట్‌ను వాయిదా వేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు డీఈఓ అనురాధను కోరారు. ఈ విషయమై మంగళవారం డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పదోతగరతి సప్లిమెంటరీ పరీక్షలు, జూన్ 4వ తేదీ జరిగే సార్వత్రిక ఎన్నికల కౌటింగ్‌కు సంబంధించి మే 29వ తేదీన ప్రధానోపాధ్యాయులకు శిక్షణా తరగతులను దృష్టిలో ఉంచుకుని ఆడిట్ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని కోరారు. పై రెండు కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు పాల్గొనాల్సి ఉన్నందున అడిట్‌కు హాజరుకావడం సాధ్యం కాదన్నారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి సీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య జిల్లాలో 1 నుంచి కొత్త ట్రాఫిక్ నిబంధనలు

రాయచోటి టౌన్: అన్నమయ్య జిల్లాలో జూన్ 1వ తేది నుంచి కొత్త ట్రాఫిక్ నిబంధనలు అమల్లోకి వస్తాయని అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చిన రోజు నుంచి వాహనాలను మైనర్లు నడిపితే అందుకు తల్లిదండ్రులకు కానీ సంరక్షకులకు కానీరూ.25 వేల జరిమానాతో పాటు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తామని హెచ్చరించారు. అలాగే మద్యం తాగి వాహనం నడిపితే రూ.10 వేల జరిమానాతో పాటు ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తామన్నారు.

సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ తదితరులు

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలల బీఏ, బీబీఏ, బీకాం, బీఎస్సీ ఆరో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ విడుదల చేశారు. మంగళవారం విశ్వవిద్యాలయంలోని తన చాంబర్ లో వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వైపీ వెంకటసుబ్బయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎస్. ఈశ్వర్ రెడ్డి తో కలిసి పరీక్ష ఫలితాల గణాంకాలను పరిశీలించి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ బీఏలో 658 మంది విద్యార్థులు పరీక్షలు రాయిగా అందరూ ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. బీబీఏలో 249 మంది పరీక్షలకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణత సాధించారన్నారు. బీకాంలో 4,012 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 3,947 మంది (98.38 శాతం) ఉత్తీర్ణత పొందారన్నారు. బీఎస్సీలో 3,721 మంది పరీక్షలు రాయగా 3,681 మంది (98.93 శాతం) ఉత్తీర్ణులు అయ్యారని వివరించారు. డిగ్రీ పరీక్షలు గత నెలలో మొదలై ఈనెల 24వ తేదీ వరకు జరిగాయని తెలిపారు.కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ సహాయ అధికారి డాక్టర్ గంగయ్య పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ కార్యక్రమం పరిశీలన

రాయచోటి అర్బన్ : అన్నమయ్య జిల్లాలో హజ్‌యాత్రికులకు జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కొండయ్య వైద్యశాఖ అధికారులతో కలసి పరిశీలించారు. పట్టణంలోని వాల్మీకివీధి అర్బన్ పీహెచ్‌సిలో జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన డీపీఎంఓ రియాజ్‌బేగ్, డీఐఓ ఉషశ్రీ, డీఎస్ఎంఓ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం హాజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్ క్యాంపులను నిర్వహించామన్నారు. కాగా ప్రైవేటుగా హాజ్‌యాత్రకు వెళ్లేవారికి కూడా వ్యాక్సిన్ వేయాలంటూ ప్రభుత్వం ఆదేశాలు యిచ్చిందన్నారు. ఆమేరకు వారికోసం ప్రత్యేకంగా వ్యాక్సిన్ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. శిబిరా న్ని ఉదయం 9 నుండి సాయంత్రం 4గంటల వరకు నిర్వహిస్తామన్నారు. వ్యాక్సినేషన్ అనంతరం వారికి వ్యాక్సినేటెడ్ సర్టిఫికెట్‌లను ప్రదానం చేస్తామని వివరించారు. హాజ్‌యాత్రికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు సునీత, అల్తాఫ్ పాల్గొన్నారు.

హైస్కూల్ డబుల్ ప్లస్

- ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇంటర్మీడియట్ చదువులు
- పేద, మధ్యతరగతి విద్యార్థులకు వరం
- జిల్లాకు తాజాగా 20 హైస్కూల్ ప్లస్ పాఠశాలలు మంజూరు



సువిశాలమైన ఆటస్థలం ఉన్న దువ్వూరు జెడ్పీ హైస్కూల్

కడప ఎడ్యుకేషన్: గ్రామీణ ప్రాంతాల్లోని పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన చిన్నారులకు ఉన్నత విద్యను అందుబాటులో ఉంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా ఉన్న ఊరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు తగినన్ని వసతులను కల్పించి హైస్కూల్ ప్లస్‌గా మార్చింది. చాలామంది తల్లిదండ్రులు పదోతరగతి తర్వాత తమ పిల్లలను ఊరికి దూరంగా ఉన్న కళాశాలల్లో చేర్పించాలంటే తలకు మించిన భారం కావడంతో చదువులు మాన్పిస్తున్నారు.ఇందులో బాలికలే అధికంగా ఉంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ప్రభుత్వం మనబడి నాడు నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి సకల సౌకర్యాలు కల్పించింది. ప్రభుత్వ పాఠశాలలను హైస్కూల్ ప్లస్‌గా మార్చడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో డ్రాపౌట్స్ తగ్గడంతోపాటు బాలికలు కూడా ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం ఉంటుంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో ఇంటర్ విద్య దూరం..

గతంలో గ్రామీణ ప్రాంతాలకు సమీపంలో జూనియర్ కళాశాలలు లేని కారణంగా అనేక మంది విద్యార్థులు ఇంటర్ విద్యకు దూరమయ్యారు. ఇది గమనించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అప్పట్లోనే కస్తూర్బాగాంధీ విద్యాలయాలు, ఏపీ మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేశారు. ఇంగ్లీషు మీడియంలో ఇంటర్ విద్యను అందుబాటులోకి తెచ్చారు.తర్వాత వచ్చిన పాలకులు ఇంటర్ విద్య ఏర్పాటుపై ఎటువంటి శ్రద్ధ తీసుకోలేదు. దీంతో గ్రామీణ ప్రాంతానికి చెందిన చాలామంది ఇంటర్ విద్యకు దూరమయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా తొలుత జిల్లాకు చెందిన 14 ఉన్నత పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసి హైస్కూల్ ప్లస్ పేరుతో ఇంటర్మీడియట్ కోర్సులను ప్రారంభించారు. దీంతో గ్రామీణ ప్రాంతానికి చెందిన చాలా మంది విద్యార్థులు ఇంటర్ విద్యను అభ్యసించగలిగారు. ఇంటర్ విద్యను మరికొందరికి దగ్గర చేసే కార్యక్రమంలో భాగంగా తాజాగా మరో 20 ఉన్నత పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసి హైస్కూల్ ప్లస్‌గా మార్చారు. ఇందులో 18 పాఠశాలలను కో-ఎడ్యుకేషన్ హైస్కూల్ ప్లస్‌గా మార్చగా రెండింటిని ప్రత్యేకంగా బాలికల హైస్కూల్ ప్లస్‌గా మార్చారు.

గ్రామీణ ప్రాంతాల్లో డ్రాపౌట్స్ తగ్గుతాయి



గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు హైస్కూల్ ప్లస్ వరంగా మారనుంది. దీంతో విద్యార్థుల డ్రాపౌట్స్ సంఖ్య తగ్గుతుంది. ఇందులో భాగంగా ఈ విద్యా సంవత్సరం జిల్లాలోని 20 ఉన్నత పాఠశాలను హైస్కూల్ ప్లస్‌గా ఏర్పాటు చేయడం జరిగింది. ఇది గ్రామీణ విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. - మర్రెడ్డి అనురాధ, జిల్లా విద్యాశాఖాధికారి

గతంలో మంజూరైనవి: జిల్లాలో గతేడాది 14 ఉన్నత పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసి హైస్కూల్ ప్లస్‌గా మార్చారు. ఇందులో 10 హైస్కూల్ ప్లస్ పాఠశాలలను మాత్రమే ప్రారంభించారు. ఏర్పాటు చేసిన హైస్కూల్ ప్లస్‌లో విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా అధ్యాపకులను కూడా నియమించారు.సీకేదిన్నె, తొండూరు, ఎగువ లింగాల, వేపరాల(మైలవరం) హైస్కూల్‌ను మాత్రం ప్రారంభించలేదు. గతేడాది ప్రారంభించకుండా వదిలేసిన ఈ నాలుగింటిని ఈ సంవత్సరం హైస్కూల్ ప్లస్‌గా తిరిగి ప్రారంభించనున్నారు.

ఒక్కో స్కూల్‌లో రెండు గ్రూపులు..

ప్రస్తుతం ఇంటర్మీడియట్‌లో డిమాండ్ ఉన్న ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులను జూనియర్ కళాశాలల్లో నిర్వహిస్తారు. అయితే ఈ ఏడాది ఒక్కో స్కూల్లో ఏదేని రెండు గ్రూపులకే ప్రవేశాలను నిర్వహిస్తారు. ప్రతి గ్రూపులో 40 మందికి ప్రవేశం కల్పిస్తారు. ఒక్కో పాఠశాలలో 80 మంది విద్యార్థిని, విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించేలా చర్యలు తీసుకున్నారు. హైస్కూల్ ప్లస్‌గా ఎంపిక చేసిన పాఠశాలలో కళాశాల నిర్వహణకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులను కల్పించనున్నారు.ఆయా మండలాల పరిధిలోని గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఈ స్కూళ్ల ఏర్పాటుతో ఉన్నత విద్య చేరువకానుంది.

కో- ఎడ్యుకేషన్‌కు సంబంధించి హైస్కూల్ ప్లస్ వివరాలు

మండలం	స్కూళ్లు
అట్లూరు	జెడ్పీ హైస్కూల్, అట్లూరు
బికోడూరు	గవర్నమెంట్ హైస్కూల్, బి కోడూరు
బద్వేల్	జెడ్పీ బాలికల హైస్కూల్
బిమఠం	జెడ్పీ బాలుర హైస్కూల్, కేఎం పల్లి
చాపాడు	జెడ్పీ హైస్కూల్, చాపాడు
చెన్నూరు	జెడ్పీ బాలుర హైస్కూల్
సీకేదిన్నె	జెడ్పీ హైస్కూల్ , జె కొత్తపల్లి
దువ్వూరు	జెడ్పీ హైస్కూల్, గోపవరం
గోపవరం	జెడ్పీ హైస్కూల్, రాచాయపేట
కలసపాడు	జెడ్పీ హైస్కూల్
కమలాపురం	జెడ్పీ బాలికల హైస్కూల్
ముద్దనూరు	జెడ్పీ బాలికల హైస్కూల్
పెద్దముడియం	జెడ్పీ హైస్కూల్
రాజుపాలెం	జెడ్పీ హైస్కూల్
సిద్దవటం	జెడ్పీ హైస్కూల్, 11 బెటాలియన్
సింహాద్రిపురం	జెడ్పీ హైస్కూల్
వీరపునాయనపల్లె	జెడ్పీ హైస్కూల్, గంగిరెడ్డిపల్లె
ఒంటిమిట్ట	జెడ్పీ హైస్కూల్, న్యూ మాధవరం
బాలికల హైస్కూల్ ప్లస్ పాఠశాలల వివరాలు...	
రాజుపాలెం	జెడ్పీ హైస్కూల్, కొర్రపాడు
వీఎస్‌పల్లె	జెడ్పీ బాలికల హైస్కూల్, ఉరుటూరు

ఇంటర్ మ్యాథ్స్-బి, హిస్టరీ పరీక్షలు ప్రశాంతం

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన ఇంటర్ మ్యాథ్స్-బి,హిస్టరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం సెషన్‌లో 37 పరీక్షా కేంద్రాల్లో జరిగిన పరీక్షకు జనరల్‌కు సంబంధించి 8052 మందికి 7766 మంది హాజరుకాగా 286 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 469కి 441 మంది హాజరుకాగా 28 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 22 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు జనరల్‌కు సంబంధించి 1675 మందికి 1581 మంది హాజరుకాగా 94 మంది గైర్హాజరయారు. ఒకేషనల్‌కు సంబంధించి 153 మందికి 145 మంది హాజరుకాగా 08 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఇంటర్మీడియట్ ఆర్ఐవో బండి వెకంటసుబ్బయ్య తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ విజయవాడలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్, టెక్నాలజీ(సీపెట్)డిప్లమో కోర్సులకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని జాయింట్ డైరెక్టర్ అండ్ హెడ్ డాక్టర్ శేఖర్ తెలిపారు. 10వ తరగతి విద్యార్హతతో 3 సంవత్సరాల వ్యవధి గల డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ, డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ(డీపీఎంటీ), బీఎస్సీ విద్యార్హతతో 2 సంవత్సరాల వ్యవధి గల పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ పెరాసెస్సింగ్ అండ్ టెస్టింగ్ కోర్సులకు https://cipet24.online registrationform.org. cipet/ అనే లింక్ ద్వారా ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కోర్సులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం ఉందని తెలిపారు. సీపెట్ అడ్మిషన్ టెస్టు జూన్ 9న నిర్వహించి అందులో వచ్చిన ర్యాంకు ఆధారంగా విజయవాడ కేంద్రంలో 150 సీట్లను భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు, ఇతర వివరాలకు శ్రీను సెల్ నంబర్ 6300147965లో సంప్రదించాలని శేఖర్ తెలిపారు.

సూర్యప్రభ వాహనంపై గోవిందుడు



సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన నారాపురం వెంకటేశ్వర స్వామి

జమ్మలమడుగు: నారాపురస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సతీసమేతంగా వేంకటేశ్వర స్వామి సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం ఉదయం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి సూర్యప్రభ వాహనంపై పురవీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారి ముందు కోలాటం ఆడుతూ, అన్నమయ్య కీర్తనలు పాడుతూ పారవశ్యంతో నృత్యాలు చేశారు. దేవదేవుడు తమ ఇళ్లముందు నుంచి వెళుతుండటంతో ప్రజలు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం రథోత్సవం అనంతరం ఆలయంలో భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. మంగళవారం స్వామిదర్శనం కోసం భక్తులు బారులు తీరారు. సాయంత్రం స్వామి వారు చంద్ర ప్రభ వాహనంపై భక్తులకు కనువిందు చేశారు.

నేడు చక్రస్నానం...

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం తిరుచ్చి వసంతోత్సవం, చక్రస్నానం కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

బడి బస్.. ఫిట్‌నెస్

- జిల్లా రవాణా శాఖ కార్యాలయం వద్ద బడి బస్సుల తనిఖీ
- కండిషన్‌లో లేకుంటే అనుమతి నిరాకరణ



ఫిట్‌నెస్ పరీక్షకు వచ్చిన విద్యా సంస్థల బస్సులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో పాఠశాలలు త్వరలోనే పునః ప్రారంభం కానున్నాయి. బడి బస్సులు రోడ్డు ఎక్కనున్నాయి. ఈ క్రమంలో విద్యార్థులు ప్రతిరోజు ప్రయాణించే స్కూల్ కళాశాల బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలకు రవాణా శాఖ చర్యలు చేపట్టింది. పరీక్షల్లో తప్పనిసరిగా బస్సులు కండిషన్‌లో ఉన్నట్లు రుజువు కావాలని రవాణా శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ మేరకు మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు.. సిబ్బంది ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

- జిల్లాలో బడి బస్సులు ఆరువందల వరకు ఉన్నాయి వీటిలో ప్రతిరోజు 20 నుంచి 30 బస్సుల కండిషన్ అధికారులు పరీక్షిస్తున్నారు వాహనంలో లోటుపాటు కనిపిస్తే వెంటనే వెనక్కి పంపిస్తున్నారు. ఆ లోపాలను సరిదిద్దే వరకు సర్టిఫికెట్ జారీ చేయడం లేదు.

పరీక్షలు ఇలా.....

- స్కూల్ బస్సును మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ స్వయంగా డ్రైవ్ చేస్తారు
- మరమ్మతులు ఏమైనా ఉన్నాయా అని గుర్తిస్తారు.
- బ్రేకులు, క్లచ్ స్టీరింగ్, హ్యాండ్ బ్రేక్, బ్యాటరీ, ఇంజన్‌కు సంబంధించి పలు విభాగాలను పరిశీలిస్తారు.
- అత్యవసర ద్వారాలు, కిటికీలు, టైర్లు, సీట్లను పరిశీలించి సంతృప్తి చెందిన తర్వాతే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు.

నిబంధనలు ఇలా.....

- డ్రైవర్ కు 60 ఏళ్లలోపు వయసు ఉండాలి. ఐదేళ్ల అనుభవంతో పాటు భారీ వాహన లైసెన్స్ తప్పనిసరి.
- శారీరక దారుఢ్యంతోపాటు ఆరోగ్యంగా ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం సమర్పించాలి
- డ్రైవర్ సహాయకుడు తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలి. వేగంగా నిర్లక్ష్యంగా బస్సు నడపరాదు.
- బస్సులో ప్రథమ చికిత్స బాక్స్ ఉండాలి
- విద్యార్థులు బస్సు ఎక్కేందుకు రెండు వైపులా ఇనప కడ్డీలు ఉండాలి. వాహనం ముందు భాగంలో పాఠశాల పేరు, ఫోన్ నంబర్ తప్పనిసరి.

కండిషన్లో లేకుంటే చర్యలు



స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. అన్నీ సక్రమంగా ఉంటేనే ధ్రువీకరణ పత్రం జారీ చేస్తాం. లేకపోతే ఎట్టి పరిస్థితుల్లోనూ బస్సును రోడ్డుపై తిరగనివ్వం. ఫిట్‌నెస్ పరీక్ష చేయించకుండా బస్సు నడిపితే కేసులు నమోదు చేస్తాం. లైసెన్స్ ఉన్న డ్రైవర్ తోనే వాహనాన్ని నడిపించాలి.
-మీరా ప్రసాద్,
జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్

కౌంటింగ్‌కు పటిష్టంగా భద్రత

జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు



అధికారులకు సూచనలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు. చిత్రంలో ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ తదితరులు

కడప సెవెన్‌రోడ్స్: పటిష్టమైన భద్రతా బలగాల మధ్య కౌంటింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు పేర్కొన్నారు. మంగళవారం కడప రిమ్స్ సమీపంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ నేషనల్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్ట్రాంగ్ రూముల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో పాటు, పోలింగ్ కేంద్రాల్లో పోలైన ఓట్లతో నిక్షిప్తమైన ఈవీఎంలను అత్యంత సురక్షితంగా భద్రపరిచినట్లు వివరించారు. పార్లమెంట్, ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు 14 చొప్పున ఈవీఎం టేబుళ్లను, అలాగే పోస్టల్ బ్యాలెట్ కు కూడా 14 టేబుళ్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కౌంటింగ్ హాలులో ఓట్ల లెక్కింపు సజావుగా, సౌకర్యవంతంగా జరిగేలా సెటప్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా వివిధ రాజకీయ పార్టీల ఏజెంట్లు కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశామన్నారు. ఓట్ల లెక్కింపు కోసం ఇప్పటికే సిబ్బందిని ఏర్పాటు చేసి మైక్రోఅబ్జర్వర్లు, కౌంటింగ్ ఏజెంట్లు, సూపర్ వైజర్లు, శిక్షణా కార్యక్రమం నిర్వహించామన్నారు. ఏ చిన్నపాటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కడప, బద్వేలు రిటర్నింగ్ అధికారులు మధుసూదన్, వెంకటరమణ, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల నిఘాలో ఓట్ల లెక్కింపు

కౌంటింగ్ కేంద్రంలో మొత్తం 112 సీసీ కెమెరాల నిఘాలో ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని చేపడతామని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఇప్పటికే ఈ నెల 25న కౌంటింగ్ స్టాఫ్ కు మొదటి రాండమైజేషన్ పూర్తి చేసి కౌంటింగ్ సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. జూన్ 2న రెండో రాండమైజేషన్, 4వ తేదీ కౌంటింగ్ రోజున ఉదయం 5 గంటలకు 3వ రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు చెప్పారు. ఈ కౌంటింగ్ ప్రక్రియ అంతా కూడా ఎన్నికల సాధారణ/ కౌంటింగ్ పరిశీలకులు, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో జరుగుతుందన్నారు.

- పార్లమెంట్, అసెంబ్లీకి సంబంధించి కౌంటింగ్ ప్రక్రియ జూన్ 4న ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతుందని, అసెంబ్లీ స్థానాలకు మొదట పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రారంభం అవుతుందన్నారు. పార్లమెంట్ కు సంబంధించి మొదటగా ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుందన్నారు. రాజకీయ పార్టీల తరపున కౌంటింగ్ ఏజెంట్ల పాసుల కోసం ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఏజెంట్స్ కోసం డీఆర్వో వద్ద, ఈవీఎం ఓట్ల లెక్కింపు ఏజెంట్ల కోసం ఆయా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులను సంప్రదించాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం 7 గంటల లోపు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రం/హాల్ లోకి అభ్యర్థి లేదా కౌంటింగ్ ఏజెంట్ ఒక్కరికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. సర్పంచ్, మేయర్, ఇతర కార్పోరేషన్ చైర్మన్ లు, ప్రభుత్వ సలహాదారులు, లోకల్ బాడీ మెంబర్లు తదితర ప్రజాప్రతినిధులకు కుడా అనుమతి లేదన్నారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు లోపలికి వచ్చిన కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు బయటికి వెళ్లడానికి అనుమతి లేదన్నారు.

6వ తేదీ వరకు 144 సెక్షన్ అమలు

భద్రతా చర్యల్లో భాగంగా 6వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రత్యేక నిఘాతో పాటు భద్రతా చర్యల్లో భాగంగా పోలీసు ఆంక్షలను కఠినతరం చేయడం జరుగుతుందన్నారు. గతంలో నేర చరిత్ర ఉన్న రాజకీయ పార్టీల ప్రతినిధులకు వారి ప్రవర్తనను అనుసరించి 4వ తేదీ నుండి 6వ తేదీ వరకు ముందస్తు బైండోవర్ కేసులు, జిల్లా బహిష్కరణ, గృహ నిర్బంధం వంటి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఆంక్షలు కఠినతరం

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని సజావుగా, పారదర్శకంగా, పటిష్టంగా నిర్వహించేందుకు శాంతి భద్రతల దృష్ట్యా ఆంక్షలను కఠినతరం చేయడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి విజయ్ రామరాజు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఎంసీసీ అమలు, 144 సెక్షన్ పాటింపుపై జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్‌తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన రాజకీయ పార్టీల ప్రతినిధులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో చివరి ఘట్టమైన ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని జూన్ 4వ తేదీన పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని రకాల భద్రతా చర్యలను తీసుకున్నట్లు చెప్పారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 165 మంది హాజరు



అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో మంగళవారం నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 165 మంది విద్యార్థులు హాజరయ్యారని పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి తెలిపారు.ఈ సందర్భంగా 12001 నుంచి 24 వేల వరకు ర్యాంకులు వచ్చిన అభ్యర్థులు సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకున్నారని చెప్పారు. అనంతరం విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను అందచేశామని ఆమె పేర్కొన్నారు. బుధవారం 24001 నుంచి 43000 వరకు ర్యాంకులు పొందిన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు.



ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న బీజేపీ



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మద్దిలేటి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతోందని ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మద్దిలేటి విమర్శించారు. మంగళవారం నగరంలోని హోచిమిన్ భవన్‌లో ఏఐటీయూసీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో మతాన్ని ఉపయోగించి ఓట్లు పొందాలని చూస్తున్నారన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ఎస్సీ,ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ముస్లింలకు ఇస్తారని చెప్పడం దారుణమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అయోధ్యలో రాముని విగ్రహాన్ని టెంట్‌లో వేస్తారని చెప్పడం ప్రధానికి తగునా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన ఈ మూడు పార్టీలు మోదీకి వంతపాడుతున్నాయన్నారు. దేశంలో మోదీ వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని దీన్ని పక్కదారి పట్టించేందుకు మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, ఎన్టీ రామారావు లౌకిక వ్యవస్థకు మద్దతుగా నిలిచారన్నారు. చంద్రబాబు, జగన్‌మోహన్‌రెడ్డి కూడా లౌకిక వ్యవస్థ పరిరక్షణకు పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు లింగన్న, ఆర్.బాబు, నాగిరెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఒంటిమిట్ట శాఖ, వైఎస్సార్ కడప జిల్లా

A/c No: 37841790076 (H/L)

స్వాధీనతా ప్రకటన

చట్టం - రూల్ 8(1) మరియు (2) క్రింద అనుబంధం-IV (స్థిరాస్తి కోసం)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ, **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఒంటిమిట్ట బ్రాంచ్, వైఎస్సార్ కడప జిల్లా** యొక్క అధీకృత అధికారియగు దిగువ సంతకందారు **21/03/2024 తేదీగల డిమాండ్ నోటీసు** జారీచేసి, **శ్రీ సయ్యద్ అబ్దుల్ తురబ్ జీలాని, డి.నం.51/11-2, రాజా ఫంక్షన్‌హాల్ ఎదురుగా, రవీంద్రనగర్, కడప, వైఎస్సార్ కడప జిల్లా** వారిని సదరు నోటీసులో తెలిపిన విధంగా **20/03/2024** నాటికి మొత్తం **రూ.22,80,333/- (ఇరవైరెండు లక్షల ఎనభై వేల మూడువందల ముప్పైమూడు రూపాయలు మాత్రమే) (ఏవేని చెల్లింపులు చేస్తే అవి తగ్గింపి)** + వడ్డీతో పాటు కాంట్రాక్చువల్ రేటు వంతున **21/03/2024** నుండి తదుపరి వడ్డీ మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు మొ॥వాటిని సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా తిరిగి చెల్లించాలని కోరారు.

రుణగ్రహీత సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ దిగువ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు 23/05/2024న స్వాధీనం చేసుకున్నారని ముఖ్యంగా రుణగ్రహీతకు/ గ్యారంటార్లకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

సదరు ఆస్తులతో ఎలాంటి వ్యవహారం జరుపరాదని మరియు సదరు ఆస్తులతో జరిపే ఏ వ్యవహారములైనా మొత్తం **రూ.22,80,333/-** + కాంట్రాక్చువల్ రేటు వంతున తదుపరి వడ్డీ మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు మొ॥వి **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఒంటిమిట్ట బ్రాంచ్, వైఎస్సార్ కడప జిల్లా చార్జ్‌కు** లోబడి ఉంటాయని ముఖ్యంగా రుణగ్రహీతను/ గ్యారంటార్లను మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

ఆస్తి పూర్తి వివరణ

కడప R.D. కడప అర్బన్ S.R.D., కడప మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, అక్కయ్యపల్లి ఏరియా వార్డు నం.2, శాంతినగర్ ఏరియాలోని కార్పొరేషన్ వార్డు నం.57, కడప జిల్లా, కడప రూరల్ ఉపజిల్లా గ్రామ క్షేత్రాలలో ఉన్న ప్లాట్ నం.లు 150, 151లోని ఖాళీ ఇంటి సైట్ డోర్ నం.57/416-13, కడప మున్సిపల్ కార్పొరేషన్ కడప పరిధిలోని చెమ్ముమియాపేట పైకిలోని సర్కారు పుంజీ డి.నం.లు 487, ఎ.2.72 సెంట్లు, 488, ఎ.3.26 సెంట్లు, మొత్తం విస్తీర్ణం 5.98 సెంట్లు. **ఈ ఆస్తి రిజిస్టర్ సేల్‌డీడ్ డాక్యుమెంట్ నం.5296/2018, తేదీ: 31/07/2018 ప్రకారం శ్రీ సయ్యద్ అబ్దుల్ తురబ్ జీలాని తండ్రి సయ్యద్ వాహబ్‌కు చెందినది.**

సరిహద్దులు: తూర్పు: రోడ్డు, **పశ్చిమం:** చిన్నారి సురేంద్రతేజ మరియు చిట్టిబోయిన నరసింహులు భూమి, **ఉత్తరం:** రోడ్డు, **దక్షిణం:** ఎస్. మౌలాలి మరియు దిల్షాద్ బేగం యొక్క మిగతా సైట్., **కొలతలు:- తూర్పు-పశ్చిమం ఇరువైపులా:** 40 అడుగులు లేదా 12.02 మీటర్లు, **ఉత్తరం-దక్షిణం ఇరువైపులా:** 33 అడుగులు లేదా 10.06 మీటర్లు, **మొత్తం విస్తీర్ణం:** 146.66 చ.గజాలు, **ఆర్సీసి ఇంటి కొలతలు:- తూర్పు-పశ్చిమం ఇరువైపులా:** 39 అడుగులు లేదా 11.89 మీటర్లు, **ఉత్తరం-దక్షిణం ఇరువైపులా:** 32 అడుగులు లేదా 9.76 మీటర్లు, **మొత్తం విస్తీర్ణం:** 1248 చ.అడుగులు

తేది : 23-05-2024
ప్రదేశం : ఒంటిమిట్ట
సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఒంటిమిట్ట శాఖ, వైఎస్సార్ కడప జిల్లా

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

B.TECH. అడ్మిషన్స్

■ AP EAPCET ర్యాంకు రానివారికి డైరెక్ట్ గా B.Tech. (Any Branch) లో ఫ్రీ ఎడ్యుకేషన్ కలదు. Only హాస్టల్ ఫీజు కట్టుకోవలెను. Cont : G. Murali, 9030661651.

SERIVCES

BUSINESS OFFER

■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్‌ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9253560455.

■ పెట్టుబడి పెట్టగల 7th-PG స్త్రీ/పు మా సంస్థ నిర్వహించు సెల్‌ఫోన్ ద్వారా సర్వే వ్యాపారములో భాగస్వాములుగా చేరి నెలకి అత్యధిక సంపాదన పొందగలరు. ఫోన్: 8179021818

CHANGE OF NAME

■ I, JAGU RAJA GOPAL REDDY (OLD NAME), R/O. H.NO. 3-1, DIGUVAVENKATAREDDY PALLI, KODURU (M), ANNAMAYYA (DT), A.P., HEREBY CHANGED MY NAME AS KOLAVALA MAHESWAR REDDY (NEW NAME) S/O. K. SUBBAREDDY.

■ I, JAGU SUBHASHINI (OLD NAME), R/O. H.NO.3-36, VENKATAREDDY PALLI, RLY.KODUR (M), ANNAMAYYA (DT), A.P., HEREBY CHANGED MY NAME AS KOLAVALA SUBHASHINI (NEW NAME) W/O. K. MAHESWAR REDDY.

■ నేను బోయపాటి చాముండేశ్వరి W/o బోయపాటి సురేష్‌బాబు R/O D.No.50, దిగువ సిద్దవరం (V), పెనగలూరు (M), అన్నమయ్య (Dist), A.P. దీని ద్వారా నా కుమార్తె పేరును బోయపాటి చైతన్య (పాతపేరు) నుండి బోయపాటి అలేఖ్య (కొత్తపేరు)గా మార్చాను.

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్‌టైమ్ మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ 8500రూ. మీ పేరు, అడ్రస్, కాల్/వాట్సప్ చేయగలరు. 9502815219

■ రాయచోటిలో ప్రముఖ స్కూల్‌లలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. డ్యూటీ 12 గంటలు, జీతము 8000, సంప్ర : 9440074224

■ ఉద్యోగాలు: YMC నూతనంగా ప్రారంభిస్తున్న బ్రాంచ్‌లో Job చేయుటకు యువతీ యువకులకు అవకాశం కలదు. Q: 10th, ఇంటర్, డిగ్రీ (P/F). Age: 18 to 30. నో ఫీజు. సెల్: 9177342397.

■ కడప నగరంలోని సింగపూర్ సిటిలో రోడ్ నెంబర్ 7 నందు ఇల్లు బాడుగకు కలదు. సంప్రదించాల్సిన నంబర్ : 8331951098

■ డియాస్ నాన్ సర్జికల్ స్లిమ్మింగ్ & న్యూట్రీషన్ క్లినిక్ నందు పనిచేయుటకు రిసెప్షనిస్టులు మరియు ఫిజియోథెరపిస్టులు కావలెను. విద్యార్హత : రిసెప్షనిస్ట్ - డిగ్రీ/ఇంటర్, ఫిజియోథెరపిస్ట్ - BPT అడ్రస్ : సంధ్యా సర్కిల్, కడప, సెల్ : 8688018602

■ Wanted Teachers : Higher Classes : Physics, English, Urdu, Computer & G.K, Lower Classes (For Ladies Only) English, EVS, Urdu Cont: 9182856272, 6303989168

■ హారూన్ ఆటోమోటివ్స్ బద్వేల్ Showroom నందు పనిచేయుటకు Manager మరియు Sales Executives కావలెను. అర్హత :10th to డిగ్రీ సంప్ర:9440280831, 9603654564

■ MANAS TV 19 Youtube ఛానల్ నందు యాంకర్స్, ఎడిటర్స్, ప్రమోషన్ యాడ్స్ సేకరించుటకు మండల ప్రతినిధులు అర్జెంటుగా కావలెను. జీ. 10000 to 20000 వరకు ✆ 9515983309

■ Wanted Sales Boys and Power Tools Machines Service Boys Experienced Cuddapah Agencies 7 Roads Circle sfs Street Kadapa Opposite to Life Pharma Medicals: 9347117179

■ [illegible] కాదు. VIP ఇళ్లలో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీ/పురుషులు, ఆయా, నర్సులు, వంటచేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ. 15000-40000, ఫ్రీ రూమ్ + భోజనం. HYD. ఫోన్: 7995985999

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ. 18K. ఫోన్: 9160900024 / 9640400073

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కడప, కర్నూలు జట్ల విజయకేతనం


తలపడుతున్న కడప, అనంతపురం జట్లు


జహీర్ అబ్బాస్, కడప (50 పరుగులు)


హరిశంకర్‌రెడ్డి, కడప (5 వికెట్లు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రీడామైదానాలు వేదికగా మంగళవారం ఏసీఏ సౌత్‌జోన్ అంతర్ జిల్లాల క్రికెట్ మ్యాచ్‌లు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. కేఓఆర్ఎం మైదానంలో చిత్తూరు, కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో చిత్తూరు జట్టు 9 వికెట్ల నష్టానికి 273 పరుగులు చేసింది. జట్టులోని కె.ఎస్. పృథ్వీరాజ్ 91 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్‌లతో 88 పరుగులు చేశాడు. ధరణికుమార్ 91 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్సర్‌లతో 83 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్ సుదర్శన్‌రెడ్డి 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 47.5 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 274 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని యూఎంఎస్ గిరినాథ్ 95 ఓవర్లలో 11 ఫోర్లతో 84 పరుగులు చేయగా, కమ్రుద్దీన్ 35 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్‌లతో 53 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్ దీపక్‌సాయి 1 వికెట్ తీశాడు. కాగా కర్నూలు జట్టు 4 వికెట్ల తేడాతో విజయం సాధించి 4 పాయింట్లు కైవసం చేసుకుంది.

కేఎస్ఆర్ఎం మైదానంలో..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో కడప, అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అనంతపురం జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 208 పరుగులు చేసింది. కడప బౌలర్ హరిశంకర్‌రెడ్డి 5 వికెట్లు తీశాడు. అనంతరం కడప జట్టు బ్యాటింగ్‌కు దిగగా మైదానంలో ఏర్పాటు చేసి సైడ్‌స్క్రీన్ కింద పడటంతో మ్యాచ్ ఆలస్యమైంది. దీంతో 191 పరుగుల విజయ లక్ష్యాన్ని కడప జట్టుకు నిర్దేశించారు. దీంతో కడప జట్టు 6 వికెట్ల నష్టానికి 191 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని జహీర్ అబ్బాస్ 50 పరుగులు చేశాడు. దీంతో కడప జట్టు 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

నేటి నుంచి గండిలో హనుమజ్జయంతి వేడుకలు


గండి వీరాంజనేయ స్వామి మూల విరాట్

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో బుధవారం సాయంత్రం నుంచి హనుమజ్జయంతి వేడుకలు నాలుగు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. ఆలయ ప్రధాన, ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజ గోపాలాచార్యుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరుగుతాయన్నారు. బుధవారం సాయంత్రం అంకురార్పణ ఉంటుందన్నారు. గురువారం వేదపారాయణం, యాగశాల ప్రవేశం, ద్వారతోరణం, ఆరాధన తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. శుక్రవారం త్రికాల ఆరాధన, చతుస్థానార్చన, చివరి రోజున త్రికాల ఆరాధన, తీర్థ ప్రసాద వినియోగంతో హనుమజ్జయంతి వేడుకలు ముగుస్తాయని వివరించారు.

న్యాయమూర్తి ప్రత్యేక పూజలు


దండు మారెమ్మ ఆలయంలో చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు

తంబళ్లపల్లె : మండలంలోని కన్నెమడుగులో వెలసిన దండుమారెమ్మ అమ్మవారిని వైఎస్సార్ జిల్లా పులివెందుల కోర్టు న్యాయమూర్తి చంద్రశేఖర్ రెడ్డి, కళావతమ్మ దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. విలేకరులతో వారు మాట్లాడుతూ అమ్మవారి కృపా కటాక్షంతో వర్షాలు సకాలంలో కురిసి పాడి పంటలతో కళకళలాడాలని మొక్కుకున్నట్లు తెలిపారు.

తత్కాల్ ఫార్మ్స్‌పై నంబర్లు వేసి ఇవ్వాలి


స్టేషన్ మాస్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న విజయ్ బాబు తదితరులు

కమలాపురం : రైల్వేలో సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ముందుగా దరఖాస్తు చేసుకునే తత్కాల్ ఫార్మ్స్‌పై నంబర్లు వేసి ఇన్షియల్ వేసి ఇవ్వాలని అభి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్. విజయ్ బాబు తెలిపారు. మంగళవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో విధుల్లో ఉన్న స్టేషన్ మాస్టర్‌కు ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైళ్లలో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యం కోసం రైల్వే శాఖ ఒక రోజు ముందుగా తత్కాల్ ద్వారా దరఖాస్తు చేసుకునే సౌకర్యం కల్పించిందన్నారు. అయితే దరఖాస్తులు ఎక్కువ ఉంటే తమకు సీట్లు కన్ఫార్మ్ అవుతాయో? లేదో? అనే ఆందోళనతో ముందుగా దరఖాస్తు చేసి కౌంటర్‌లో ఉంచిన ఫామ్స్‌ను తర్వాత వచ్చే ప్రయాణికులు నంబర్లు మార్చడం గాని, చించి వేయడం గాని జరుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో కౌంటర్ వద్ద ఘర్షణలు జరిగే అవకాశం ఉందన్నారు. రైల్వే అధికారులు స్పందించి తత్కాల్ ఫామ్స్ ఇచ్చే సమయంలోనే స్పెషల్ ఇంక్‌తో నంబర్‌తో పాటు ఇన్షియల్ వేసి ఇస్తే ఇలాంటి సమస్యలు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో ప్రయాణికులు పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : రాయలసీమ పరిధిలోని పలు కార్పొరేట్ పాఠశాలల్లో ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. మంగళవారం పాఠశాల విద్య ఆర్‌జేడీ ఎద్దుల రాఘవరెడ్డిని కలిసి ఈమేరకు వినతిపత్రం సమర్పించారు. ఇప్పటికే కార్పొరేట్ పాఠశాలలు 40 శాతం అడ్మిషన్లు పూర్తి చేశాయని తెలిపారు. అలాగే గుర్తింపు లేని పాఠశాలల జాబితాను పత్రికలకు విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీనాథ్ యాదవ్, అన్నమయ్య జిల్లా నాయకుడు స్వరూప్‌తేజ, అనంతపురం పీడీఎస్‌యూ నాయకుడు విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్మీ మాజీ ఉద్యోగి మృతి


మృతి చెందిన వెంకటేష్

కురబలకోట : కురబలకోట రైల్వే ఫ్లైఓవర్ (ఆర్ఓబీ)వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్మీ మాజీ ఉద్యోగి ఎం. వెంకటేష్ (63) మృతి చెందారు. ముదివేడు ఎస్ఐ మల్లికార్జున రెడ్డి కథనం మేరకు..కురబలకోట రైల్వే ఫ్లైఓవర్ పక్కన పూరేండ్లవారిపల్లెకు చెందిన మాజీ మిలిటరీ ఉద్యోగి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతను మంగళవారం మధ్యాహ్నం ఫ్లైఓవర్ వద్ద టీపీఎస్‌పై రోడ్డు దాటుతుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. రెండు కాళ్లు విరిగిపోయాయి. హుటాహుటిన ఇతన్ని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం తిరుపతి ఆసుపత్రికి రెఫర్ చేశారు. మరో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన రాయచోటికి చెందిన వారి కారు స్వాధీనం చేసుకున్నారు. బాధ్యులపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

101 రేషన్ బియ్యం బస్తాలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం బస్తాలతో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు

సిద్దవటం : మండలంలోని ఆకురోపల్లె గ్రామంలోని ఎస్సీ కాలనీలో తన పాత ఇంటిలో అక్రమంగా నిల్వ చేసిన 101 రేషన్ బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నామని కడప విజిలెన్స్ సీఐ టి. రెడ్డెప్ప తెలిపారు. కడప రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసుంబాషా ఆదేశాల మేరకు ఈ దాడి నిర్వహించామన్నారు. సిద్దవటం గ్రామానికి చెందిన యర్రగుండు నాగమునిరెడ్డి అలియాస్ బుజ్జిరెడ్డి ఆకురోపల్లె గ్రామం ఎస్సీ కాలనీలోని తన పాత ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన 43 క్వింటాళ్ల 101 బియ్యం బస్తాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ రేషన్ బియ్యం విలువ రూ. 1,85,072 చేస్తుందన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడిలో విజిలెన్స్ అగ్రికల్చర్ అధికారి ఇ. బాలగంగాధర్‌రెడ్డి, డీసీటీఓ ఎస్. ఖాజాహుస్సేన్, సిద్దవటం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బి. అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

కేదార్‌నాథ్‌లో బద్వేలు వాసి మృతి


వెంకటసుబ్బయ్య (ఫైల్)

బద్వేలు అర్బన్ : ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని కేదార్‌నాథ్ ఆలయ దర్శనానికి వెళ్లిన బద్వేలు వాసి మంగళవారం ఉదయం అక్కడ గుండెపోటుతో మృతి చెందారు. సన్నిహితులు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీలో నివసించే మర్రి వెంకటసుబ్బయ్య (67) ఉపాధ్యాయుడుగా పనిచేస్తూ 8 ఏళ్ల క్రితం పదవీ విరమణ పొందారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తున్నారు. తన మిత్రులతో కలిసి మూడు రోజుల క్రితం కేదార్‌నాథ్ యాత్రకు వెళ్లారు. మంగళవారం ఉదయం కేదార్‌నాథ్ సమీపంలో వెంకటసుబ్బయ్యకు గుండెపోటు రావడంతో పాటు శ్వాస సంబంధిత ఇబ్బందులు తలెత్తడంతో అక్కడ మృతి చెందినట్లు ఆయనతో పాటు వెళ్లిన స్నేహితుల ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందింది.

మైదుకూరు డీఎస్పీకి చార్జ్ మెమో


టి. వెంకటేశులు (ఫైల్)

కడప అర్బన్ : మైదుకూరు డీఎస్పీ టి. వెంకటేశులుకు పోలీసుశాఖ ఉన్నతాధికారులు మంగళవారం చార్జ్ మెమో జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున మైదుకూరు నియోజక వర్గం పరిధిలో చాపాడు మండలంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ ఏజెంట్ల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలపై మైదుకూరు డీఎస్పీ టి. వెంకటేశులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారని ఎన్నికల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ సంఘటనలో చాపాడు ఎస్ఐపై కూడా శాఖాపరమైన విచారణకు ఆదేశాలు ఇచ్చారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం



లక్కిరెడ్డిపల్లి : రామాపురం మండలం, పాలనగారిపల్లి వంక నుంచి నాలుగు ట్రాక్టర్లు అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా లక్కిరెడ్డిపల్లి ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్ తమ సిబ్బందితో కలిసి స్వాధీనం చేసుకున్నారు. పదివేల రూపాయలు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాక్టర్లతోపాటు 16 టన్నుల ఇసుకను కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. చెరువులు, నదుల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే ట్రాక్టర్‌కు రూ. 10 వేలు, టిప్పర్‌కు రూ. 25 వేలు జరిమానా ఉంటుందన్నారు. రెండోసారి పట్టుబడితే ట్రాక్టర్‌కు రూ. 25 వేలు, టిప్పర్‌కు రూ. 50 వేలు జరిమానా, మూడోసారి పట్టుబడితే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ దాడిలో ఎక్సైజ్ ఎస్ఐ జబీవుల్లా, నాగరాజు, జ్యోతి, సిబ్బంది జగదీశ్వర, ఆంజనేయులు పాల్గొన్నారు.

రెండు ఆవులు మృతి


మృత్యువాతపడ్డ ఆవులు

చిన్నమండెం : విషాహారం తినడంతో రెండు ఆవులు మృతి చెందినట్లు బాధిత రైతు ఖలీల్‌బాషా తెలిపారు. మండల పరిధిలోని చాకిబండ కస్బాకు చెందిన ఖలీల్‌బాషా ఆవులే జీవనాధారంగా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో విషపు ఆహారం తినడంతో మృత్యువాతపడినట్లు ఆవులను పరీక్షించిన పశువైద్యుడు గణేష్ తెలిపారు. దాదాపు రూ.3 లక్షల విలువ కలిగిన రెండు ఆవులు మృత్యువాతపడటంతో బాధిత రైతు లబోదిబోమంటున్నాడు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి


మృతి చెందిన వృద్ధుడు

కొండాపురం : మండల పరిధిలోని డొంకుపల్లె గ్రామ సమీపంలో మంగళవారం గుర్తు తెలియని వృద్ధుడు(65) మృతి చెందాడు. కొండాపురం ఎస్ఐ యోగీంద్ర మాట్లాడుతూ మృతుడు యాచకుడై ఉండవచ్చన్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

రోడ్డు ప్రమాదంలో సిరికల్చర్ ఉద్యోగి మృతి


మృతిచెందిన తమిళసెల్వం

మదనపల్లె : రోడ్డుప్రమాదంలో సిరికల్చర్ ఉద్యోగి మృతి చెందిన ఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. తాలూకా పోలీసులు తెలిపిన మేరకు వివరాలు... చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం గంగవరం లంకకాలనీకి చెందిన తమిళసెల్వం(60) సిరికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో డిప్యుటేషన్‌పై ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం మదనపల్లె మండలంలోని 150వ మైలువద్ద ఉన్న సిరికల్చర్ శిక్షణా కేంద్రంలో ఏడీ రమణారెడ్డి పదవీ విరమణ కార్యక్రమానికి హాజరయ్యారు. తిరిగి సాయంత్రం సిరికల్చర్ శాఖకు చెందిన ప్రభుత్వ వాహనంలో ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యంలో డోర్ అకస్మాత్తుగా తెరచుకోవడంతో ప్రమాదవశాత్తు జారి రోడ్డుపై పడ్డాడు. ప్రమాదంలో తలకు తీవ్ర గాయమై, అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. తిరుపతికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రి మార్చురీ గదికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ప్రమాదంలో మృతి చెందిన తమిళసెల్వం నెలరోజుల్లో పదవీ విరమణ చేయనున్నారు. ఈలోపు ప్రమాదంలో మృతి చెందడంపై తోటి ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. తమిళసెల్వంకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


గాయపడిన అమరనాథరెడ్డి

సంబేపల్లె : చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిలోని నారాయణరెడ్డి గారిపల్లె సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అమరనాథరెడ్డి అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు రాయచోటి పట్టణానికి చెందిన అమరనాథరెడ్డి తన ద్విచక్రవాహనంలో నారాయణరెడ్డిపల్లె పెట్రోల్ బంకు సమీపంలో రోడ్డు దాటుతుండగా కలకడ వైపు నుంచి రాయచోటికి వెళ్తున్న స్కార్పియో వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో అమరనాథరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

‘వ్యవసాయం’సినిమా నిర్మాణం అభినందనీయం


వ్యవసాయం చిత్రం యూనిట్‌తో రోహన్ నాగిరెడ్డి

చక్రాయపేట : వ్యవసాయం పేరుతో రైతుల గురించి సినిమా నిర్మించడం అభినందనీయమని శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్ కుమార్ రెడ్డి తనయుడు రోహన్ నాగిరెడ్డి పేర్కొన్నారు. శ్రీ సమరసింహా ప్రజెంట్స్ పతాకంపై వ్యవసాయం అనే సినిమా పూజా కార్యక్రమం మంగళవారం గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని రోహన్ నాగిరెడ్డి ప్రారంభించినట్లు నిర్మాత గంగాధరరెడ్డి, దర్శకుడు ఇన్ఫినిటీ రఘు తెలిపారు. పులివెందుల, అనంతపురం ప్రాంతాల్లో ఈనెల 30 నుంచి జూన్ 10 వరకు షూటింగ్ నిర్వహించనున్నట్లు వారు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయం చిత్ర నటీ నటులు మంజు, చంద్రశేఖరరెడ్డి, దామోదరరెడ్డి, అన్నారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాప్తాడు వంశీ, మానస హరి, డ్రోన్ శివ, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

- భూదందాలకు పాల్పడుతున్న 22 మంది బైండోవర్
- పట్టణ ప్రశాంతతను కాపాడే దిశగా పోలీసుల చర్యలు


భూదందాలకు పాల్పడుతున్న 22 మందిని బైండోవర్ చేసిన పోలీసులు

మదనపల్లె : మదనపల్లె ప్రశాంతతను కాపాడేందుకు, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చర్యలు తీసుకున్నారు. పోలీసులకు అందిన కచ్చితమైన సమాచారం మేరకు.. పట్టణంలో గ్యాంగులుగా ఏర్పడి భూదందాలు, బెదిరింపులకు పాల్పడుతూ, ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్న 22 మందిని బైండోవర్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి దందాలకు, నేరాలకు పాల్పడకుండా 22 మందిని సెక్షన్ 107 కింద కేసు నమోదు చేసి, సెక్యూరిటీ కింద రూ.లక్ష పూచీకత్తుతో మండల మేజిస్ట్రేట్, తహసీల్దార్ రమాదేవి ఎదుట హాజరుపరిచారు. అనంతరం తమదైన శైలిలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐలు ఎస్.శేఖర్, యువరాజు, వలీబాషు మాట్లాడుతూ.... ల్యాండ్ మాఫియా పేరుతో ఫేక్ పట్టాలు తయారు చేసుకుని, వాస్తవ భూ యజమానులను ఇబ్బంది పెడుతూ, సమస్యను పరిష్కరించే క్రమంలో తామే మధ్యవర్తిగా వ్యవహరిస్తూ.. లక్షల రూపాయల దోపిడీకి పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు.

బైండోవర్ చేసిన వారిలో మనోహర్, వినోద్, నరేష్, నవీన్‌నాయక్, దేవా, గంగాధర్, నాగరాజు, సుధీర్‌కుమార్, వెంకటరమణ, లవకృష్ణ, బత్తుల రెడ్డిశేఖర్, ఎస్.నరేష్, చంద్రశేఖర్, రూపక్‌నాయక్, వెంకటేష్, జమిత్, అహ్మద్‌అలీ, రెడ్డిశేఖర్, చల్లా రుద్రయ్య, కె.హరిబాబు, గురుమూర్తి, రాఘవేంద్ర, కె.రాజేష్‌లు ఉన్నారన్నారు. వీరే కాకుండా ఇంకా ఎవరైనా పట్టణంలో భూదందాలు, బెదిరింపులకు పాల్పడే వ్యక్తులు ఉంటే తమ దృష్టికి తెస్తే వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. భూతగాదాలు, భూదందాల్లో బాధితులు ఎవరైనా ఉంటే ఎలాంటి భయం లేకుండా సంబంధిత పోలీస్ స్టేషన్‌కు వచ్చి ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. అలాగే... పోలీసులు, రెవెన్యూ అధికారుల పేర్లు చెప్పి సమస్య పరిష్కరిస్తామని ఎవరైనా డబ్బులు ఇవ్వాలని కోరితే ఇవ్వవద్దన్నారు. సమస్య ఉంటే నేరుగా సంబంధిత అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలన్నారు. అధికారులు, కులసంఘాల పేర్లు చెప్పి, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతామని కొంతమంది వ్యక్తులు అమాయకులను బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వీటికి సంబంధించి ఫిర్యాదులు లేకపోవడంతో తామేమీ చేయలేకపోతున్నామని, బాధితులు ధైర్యంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే అసాంఘిక శక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.